ఉదయం ఎండ.. సాయంత్రం వాన



గుడిపాల వద్ద బుధవారం సాయంత్రం వరకు ఎండ తీవ్రంగా కాయగా.. సాయంత్రానికి మబ్బులు కమ్ము కోవడంతో వాతావరణం చల్లబడిందిలా..

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 19: జిల్లాలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. రాత్రివేళల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండగా, పగటివేళల్లో ఎండలు దంచేస్తున్నాయి. వేసవి మాదిరిగా అధిక ఎండలు, వడగాడ్పులు కొనసాగుతున్నాయి. ఎండకు ఉక్కపోత తోడవడంతో జనం సతమతమవుతున్నారు. బుధవారం ఉదయం నుంచీ ఎండ తీవ్రంగా ఉండగా.. సాయంత్రానికి చాలాచోట్ల వర్షం పడింది. నాలుగు మండలాలు మినహా జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వ ర్షాలు కురిసాయి. అత్యధికంగా పెద్దపంజాణిలో 90.6, అత్యల్పంగా శాంతిపురంలో 2.2మిమీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా శ్రీరంగరాజపురంలో 39.8, తవణంపల్లెలో 36.2, సదుంలో 35.2, నిండ్రలో 35.2, పూతలపట్టులో 33.2, చిత్తూరు రూరల్‌లో 31.0, పులిచెర్లలో 25.2, విజయపురంలో 25.2, చౌడేపల్లెలో 23.6, నగరిలో 23.2, పాలసముద్రంలో 22.2, పుంగనూరులో 21.4, రొంపిచెర్లలో 21.2, గుడిపాలలో 18.2, సోమలలో 17.4, ఐరాలలో 16.2, గంగవరంలో 15.4, యాదమరిలో 15.4, పెనుమూరులో 15.2, గంగాధరనెల్లూరులో 15.2, చిత్తూరు అర్బన్‌లో 14.2, కార్వేటినగరంలో 11.4, వెదురుకుప్పంలో 10.2, పలమనేరులో 5.6, బైరెడ్డిపల్లెలో 5.4, బంగారుపాళ్యంలో 3.2, శాంతిపురంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.





ఉధృతంగా ప్రవహిస్తున్న సీతమ్మచెరువు వంక - నంజంపేట సమీపంలో గార్గేయ నది ప్రవాహం

గార్గేయ నదికి జలకళ

భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న గార్గేయ నది

సోమల: భారీ వర్షాలతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాలతో గార్గేయనదికి జలకళ సంతరించుకుంది. పెద్దఉప్పరపల్లె సమీపంలోని దుర్గంకొండలో ఆవిర్భవించి బోనమంద, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, నంజంపేట మీదుగా గార్గేయనది ప్రవాహ వేగం పుంజుకుంది. పెద్దఉప్పరపల్లె- చౌడేపల్లె మార్గంలో సీతమ్మచెరువు వంక ఉధృతితో రాకపోకలు స్తంభించాయి. వంకలు దాటేందుకు ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. గార్గేయ నది ప్రవాహ వేగంతో చిన్నకమ్మపల్లె, రెడ్డివారిపల్లె, బోనమంద మార్గాల్లో రాకపోకలు కష్టంగా మారాయి.

అతడు మండల పరిషత్తు కార్యాలయంలో కంప్యూటరు ఆపరేటరు. కాంట్రాక్టు ఉద్యోగం. ఆన్‌లైన్ బెట్టింగులకోసం కార్యాలయానికి సంబంధించి రూ.1.36 కోట్లను గోల్‌మాల్ చేశాడు. రెండేళ్ల వ్యవధిలో జరిగిన ఈ వ్యవహారం బుధవారం వెలుగులోకి వచ్చింది.

అమ్మో.. కాంట్రాక్టు ఉద్యోగి!

పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో రూ.1.36 కోట్లు గోల్‌మాల్

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సాధారణ నిధులు కాజేసిన వైనం

పుంగనూరు, జూన్ 19: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి సునీల్ రూ.1.36 కోట్ల ప్రభుత్వ నిధులను గోల్‌మాల్ చేశాడు. 2022, 2023 సంవత్సరాల కాలంలో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేశాడు. ఈ రెండేళ్లలో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఏవో, ఎంపీడీవోలు ఏమాత్రం పట్టించుకోకుండా ఇతడిపై వదిలేశారు. గతంలో పనిచేసే అధికారి నుంచి నిధులు ఆన్‌లైన్‌లో డ్రా చేయడం, తదితర సాంకేతిక నైపుణ్యాన్ని సునీల్ నేర్చుకున్నాడు. మరోవైపు అధికారుల అజమాయిషీ లేకపోవడంతో మండల జనరల్ ఫండ్స్ నుంచి కొద్దికొద్దిగా డ్రా చేసి తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయడం మొదలు పెట్టాడు. తొలుత అధికారులు, సిబ్బంది జీతభత్యాల ఫైళ్లను అధికారుల వద్దకు తీసుకెళ్లి కొన్ని రిజక్ట్ అయ్యాయని, ఒరిజినల్ ఫైల్స్ చూపి లాగిన్ కీ, ఫింగర్ ప్రింటు తీసుకొని వాటితో పాటు ఆపరేటర్ సొంత బ్యాంకు ఖాతాకు వేల రూపాయల నుంచి లక్షల రూపాయలు దర్జాగా కాజేశాడు. గోల్‌మాల్ విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో అడ్డుఅదుపూ లేకుండా ఎంచక్కా రూ.1.36 కోట్లను మండల పరిషత్ అకౌంట్‌నుంచి నేరుగా తన బ్యాంక్ అకౌంట్‌కు జమచేస్తూ వచ్చాడు. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులకు ట్రాన్స్‌ఫర్ చేసి నష్టపోయినట్లు తెలిసింది. ఈ సంఘటన అధికారులకు తెలియడంతో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాన్ని వదిలేసి సునీల్ వెళ్లిపోయాడు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రూ.1.36 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయింది. ఎలాగైనా ఈ నిధులను రికవరీ చేసి జమ చేయాలని అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పోలీసులు, జడ్పీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి ఇబ్బంది పడుతూ వీరు కాలం గడిపారు. చివరకు ఈ విషయం జడ్పీ సీఈవో గ్లోరియా దృష్టికి వెళ్లడంతో ఆమె అధికారులను సంజాయిషీ కోరారు.



నిధుల దుర్వినియోగంపై మెమో జారీ చేశాం

కాగా, రూ.1.36 కోట్ల జనరల్ ఫండ్ దుర్వినియోగంపై సంబంధిత అధికారులకు మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో మునిరెడ్డి తెలిపారు. జడ్పీ సీఈవో గ్లోరియా నుంచి బుధవారం ఆదేశాలు రావడంతో గతంలో పుంగనూరులో పనిచేసిన ఎంపీడీవో, ఏవో తదితరులకు నిధుల దుర్వినియోగంపై సంజాయిషీ నోటీసుల మెమో ఇచ్చి మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ నిధుల దుర్వినియోగంపై జడ్పీ సీఈవో విచారణ అధికారిని నియమించి చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

రుషికొండకు.. మీ బెంజ్ కారుకు లింకేంటి?

● మాజీ మంత్రి రోజాకు 'ఎక్స్'లో భాను ప్రశ్న

చిత్తూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది మీ యవ్వారం.. ముందు రుషికొండ ప్యాలెస్‌కు.. మీ బెంజ్ కారుకు ఉన్న సంబంధం ఏంటో బయటపెట్టండి మాజీ మంత్రి గారు..' అంటూ ఎక్స్‌లో రోజా పోస్టును ట్యాగ్ చేస్తూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ట్వీట్ చేశారు. జగన్ కోసమని వైసీపీ ప్రభుత్వం రుషికొండలో విలాసవంతంగా నిర్మించిన నిర్మాణం.. దీనికైన ఖర్చు.. హంగు ఆర్భాటం చూసి రాష్ట్ర ప్రజలు నివ్వెరపోయారు. వైసీపీ పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చింది. తప్పును ఒప్పుకోకుండా పలువురు వైసీపీ నాయకులు బుకాయించారు. వారిలో నగరి మాజీ ఎమ్మెల్యే, పర్యాటకశాఖ మాజీ మంత్రి రోజా కూడా ఉన్నారు. ఈ మేరకు ఆమె రుషికొండ మాయాభవనాన్ని సమర్థిస్తూ మంగళవారం ఎక్స్ వేదిక ఓ పోస్టు పెట్టారు. అందులో వైసీపీని పొగిడి, టీడీపీని విమర్శించారు. రోజా పోస్టును గాలి భానుప్రకాష్ ట్యాగ్ చేస్తూ.. ఆ ప్యాలెస్‌కు, మీ బెంజ్ కారుకు మధ్యనున్న లింకేంటని అదే ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

ప్రభాకర్ రెడ్డిపై మళ్లీ ప్రారంభమైన విచారణ

చిత్తూరు రూరల్, జూన్ 19: జిల్లా పరిషత్ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై విచారణ తిరిగి ప్రారంభమైంది. ప్రభాకర్ రెడ్డి అవినీతి చేయలేదని గతంలో ఆడిట్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారు. దీనిపై ఫిర్యాదు చేసిన విశ్రాంత అధికారి కనకరాజు నాయుడు.. విచారణను థర్డ్ పార్టీకి ఇవ్వాలని పీఆర్ కమిషనరును కోరారు. దీనిపై ఈ నెల 10వ తేదీన ఆడిట్ అధికారులు విచారణ నిలిపివేసి విచారణ చేయాలా వద్దా అని కలెక్టరుకు లేఖ రాశారు. దీనిపై కలెక్టర్ కలెక్టరు షన్మోహన్ స్పందించి.. విచారణ చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరున ప్రభాకర్ రెడ్డి పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో మంగళవారం నుంచే విచారణను తిరిగి ప్రారంభించారు.

పుంగనూరులో కిలో టమోటా ధర రూ.66.70

పుంగనూరు, జూన్ 19: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రైతులు విక్రయాలకు తీసుకువచ్చిన టమోటా ధరకు రెక్కలొచ్చాయి. మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.66.70 పలికింది. గతకొద్దిరోజులుగా వేసవి ఎండతో పంట దిగుబడి తగ్గడం వల్ల టమోటా ధరలు రోజూరోజూకు పెరుగుతున్నాయి. మంగళవారం కిలో రూ. 60లకు కాగా బుధవారం రూ.66.70కు పెరిగింది. నాణ్యతను బట్టి రెండో రకం కిలో రూ. 62.70లు, మూడవ రకం కిలో రూ. 56.70 చొప్పున 291.82 మెట్రిక్ టన్నులు రైతుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

పల్ప్ రకం కాయలను గుజ్జుపరిశ్రమలకే తరలించాలి



మార్కెట్ యార్డును సందర్శించిన సాగరిక

బంగారుపాళ్యం, జూన్ 19: మామిడి రైతులు పల్ప్ రకమైన తోతాపురిని గుజ్జు పరిశ్రమలకు నేరుగా తరలిస్తే టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అదనంగా పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి సాగరిక అన్నారు. బుధవారం ఆమె స్థానిక మార్కెట్ యార్డును సందర్శించి, అక్కడి రైతులతో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన తర్వాతనే మామిడికాయలను కోయాలన్నారు. అలా కోసిన వాటిని నేరుగా గుజ్జు పరిశ్రమలకు తరలించాలని సూచించారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూన్ 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,52,94,363 లభించినట్లు ఈవో వెంకటేశు వెల్లడించారు. ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం హుండీ కానుకలను ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. 80 గ్రాముల బంగారు, 3.150 కిలోల వెండి, 904 యూఎస్ఏ, 50 ఆస్ట్రేలియా, 25 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగిట్స్ లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,376, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.27,217 సమకూరాయి. 20 రోజులలో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

● టీచరు సహా పలువురిపై కేసు

వెదురుకుప్పం, జూన్ 19: భార్యాభర్తలపై మారణాయుధాలతో దాడి చేసి, గాయపరిచిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు శశికళ తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిదొనకు చెందిన పి.రాజశేఖర్, శశికళ దంపతులపై ఆదివారం రాత్రి అదే పంచాయతీలోని ఎగువ గెరిగిదొనకు చెందిన ఆర్.హరికృష్ణ(టీచర్), అతని అనుచరులు పి.రాజేష్, సాయి, పుష్ప, వాసు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాజశేఖర్ దంపతులకు గాయాలయ్యాయి. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు సెక్షన్ 324, రెడ్ విత్ 34 ఐపీసీల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో దాడి

వెదురుకుప్పం: పాతకక్షల నేపథ్యంలో 16వ తేదీన తన భార్యాబిడ్డలపై కొందరు దాడి చేశారని ఎగువ గెరిగిదొనకు చెందిన పి.దేవరాజులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరికృష్ణతో దేవరాజులు భార్య ఆదిలక్ష్మికి పొలం వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. గ్రామ పెద్దల జోక్యంతో సర్దుబాటైంది. దాన్ని మనసులో పెట్టుకున్న హరికృష్ణ, దిగువ గెరిగిదొనకు చెందిన అతని బంధువులు వాసు, పుష్ప, సాయి, రాజేష్ కలిసి ఆదిలక్ష్మి, ఆమె పిల్లలపై దాడి చేశారు. ఆదిలక్ష్మి గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతోంది. దీనిపై హరికృష్ణ సహా అనుచరులపై 324, 34ఐపీసీ సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి

చిత్తూరు సిటీ, జూన్ 19: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిందన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తోతాపురి రకానికి టన్నుకు రూ.30 వేలు తగ్గకుండా రైతులకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ జిల్లాలోని గుజ్జు పరిశ్రమల యజమానులకు ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. యాజమాన్యాలు సహకరించి, అన్నదాతకు అండగా నిలవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

తెప్పలపై సిరులతల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, జూన్ 19 : తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మహాలక్ష్మి అలంకరణలో తిరుచానూరు పద్మావతీ దేవి తెప్పలపై విహరించి భక్తులకు అభయ ప్రదానం చేశారు.మధ్యాహ్నం ఉత్సవమూర్తికి పద్మసరోవరంలోని నీరాడమండపంలో అభిషేకం జరిగింది.శుక్రవారం జరిగే గరుడవాహనసేవతో అమ్మవారి తెప్పోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. డిప్యూటీ ఈవో గోవిందరాజన్,ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే నాని



మామండూరు వద్ద జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదం వద్ద ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించబోయి ఎమ్మెల్యే పులివర్తి నాని మానవత్వం చాటుకున్నారు. చంద్రగిరి మండలం మామండూరు వద్ద బుధవారం టమోటాలను తీసుకెళ్తున్న వ్యాన్ టైర్ పంక్చరై బోల్తా పడింది.డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో పాకాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వాహనాన్ని ఆపారు. వ్యాన్ డ్రైవర్‌ను సిబ్బంది చేత బయటకు తీయించారు. తన వాహనంలోనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందికి సూచించారు. అయితే ఆలోపు హైవే అంబులెన్స్ రావడంతో క్షతగాత్రుడు రజనీని చంద్రగిరి ఆస్పత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే చెర నుంచి క్వారీకి విముక్తి

● ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్న జనార్దన నాయుడు



మాదిగబండ సమీపంలోని క్వారీ - క్వారీలో నాలుగేళ్లుగా బండరాళ్లు తీసేయడంతో ఏర్పడిన గుంత



పలమనేరు, జూన్ 19: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చెరనుంచి క్వారీకి విముక్తి లభించింది. మాదిగబండ గ్రామసమీపంలోని తన క్వారీని జనార్దన నాయుడు స్వాధీనం చేసుకొన్నారు. వివరాలిలా ఉన్నాయి. శాంతిపురం మండలానికి చెందిన జనార్దన నాయుడు పలమనేరు మండలం మాదిగబండ వద్ద చిన్న క్వారీని కొన్నారు. దీని కోసం ప్రత్యేకంగా హెచ్‌లైన్ విద్యుత్ సరఫరా తీసుకున్నారు. క్వారీని కూడా విస్తరింపజేశారు. ఈ క్వారీలో వివిధ సైజుల్లో కంకరను తయారు చేసి రోడ్ల పనులకు, ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తుండేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటేగౌడ గెలుపొందారు. ఈ క్రమంలో ఆయన జనార్దన నాయుడి నుంచి క్వారీని లీజుకని తీసుకొన్నారు. తనకు లీజు సొమ్ము చెల్లించక పోవడంతో పాటు, తాను నెలసరి వాయిదాలతో కొన్న వాహనాలనూ వినియోగించుకొంటూ వాటికి ఈఎంఐలూ చెల్లించలేదని బాధితుడు చాలాసార్లు వాపోయారు. కాగా, తనకు చెల్లని చెక్కు ఇచ్చారంటూ కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ కోర్టులో చెక్ బౌన్సు కేసు వేశారు. తనకు ఇవ్వాల్సిన లీజు డబ్బులు ఇప్పించాలని ఆయన వైసీపీ నేతల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. తన క్వారీని వాడుకోవడంతో పాటు క్వారీకి సంబంధించిన విద్యుత్ ఛార్జీలు కూడా చెల్లించక పోవడంతో లక్షలాది రూపాయలు విద్యుత్ ఛార్జీలు పేరుకు పోయాయని, హెచ్‌టీ విద్యుత్ సరఫరా తీసుకొన్న తాను ఈ మొత్తాలను చెల్లించాల్సి వుంటుందని కావున తనకు న్యాయం చేయాలని కూడా రాష్ట్ర హైకోర్టులోనూ జనార్దన నాయుడు పిటిషన్ వేశారు. ఇంత తతంగం జరిగినా వెంకటేగౌడ తన క్వారీని విడిచి పెట్టలేదని బాధితుడు పేర్కొన్నారు. తన క్వారీ నుంచి రూ.వంద కోట్లకుపైగా జల్లి కొట్టి వివిధ సంస్థలకు, సొంత కాంట్రాక్టు పనులకు, జాతీయ రహదారి పనులకు తరలించి విక్రయించుకొన్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇన్నాళ్లుగా ఆయన ఆవేదనను అధికారులూ పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వారం కిందట తన క్వారీని జనార్దననాయుడు స్వాధీనం చేసుకొన్నారు. కాగా, విద్యుత్ బకాయిలు రూ.2లక్షలు మినహా మిగిలి మొత్తాన్ని ఇటీవల వెంకటేగౌడ క్లియర్ చేశారని జనార్దనాయుడితో పాటు విద్యుత్ అధికారులు తెలిపారు. మొత్తమ్మీద వెంకటేగౌడ చెర నుంచి క్వారీ సొంతదారు చేతికి వెళ్లింది.

ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత





పాలసముద్రం, జూన్ 19: ఫుడ్ పాయిజన్ కారణంగా పాలసముద్రానికి చెందిన వంద మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారు. గ్రామస్థులు, వైద్యాధికారుల వివరాల మేరకు.. మంగళవారం గ్రామంలో గంగజాతర జరిగింది. అమ్మవారికి గ్రామస్థులు అంబలి సమర్పించారు. దాన్ని ప్రసాదంగా స్వీకరించారు. అదే సమయంలో అన్నదానంలో మాంసాహారం భుజించారు. బుధవారం ఉదయం నుంచి చాలామందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మధ్యాహ్నానికి వందమందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. అంగన్‌వాడీ టీచర్ విజయకు అధికంగా విరేచనాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి, డి.టి మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్ గ్రామానికి చేరుకుని తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపించారు. జాతరలో భుజించిన ఆహారం పాయిజన్ కావడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా, తహసీల్దార్ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

రెఫరల్ ఆస్పత్రిగా మార్చేశారు

అపోలో స్థాయిలో అందని వైద్యం ● చిత్తూరు ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయంటూ గురజాల ఆగ్రహం ● నెలరోజుల్లో సరిచేయాలంటూ ఆదేశం



క్యాజువాలిటీలో రోగితో మాట్లాడుతున్న గురజాల

చిత్తూరు రూరల్, జూన్ 19: చిత్తూరు ప్రభుత్వాస్పత్రి (అపోలో).. రెఫరల్ ఆస్పత్రిగా మారిందని రోగుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఆయన ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. చిన్న చిన్న రోగాలకు కూడా తిరుపతి, సీఎంసీ ఆస్పత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే జిల్లా ఆస్పత్రి ఎందుకని ప్రశ్నించారు. డబ్బుల్లేక ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేదలకు.. మందులను బయటకు రాసిస్తే ఎలా కొనగలరని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. క్యాజువాలిటీలో పీజీ విద్యార్థులతో అత్యవసర వైద్యం ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. వారే నేర్చుకోవడానికి వస్తే వారి చేత పేదల ప్రాణాలు పెడుతున్నారా? అని ఆగ్రహించారు. ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే భోజనం తింటే వాంతులు వస్తున్నాయని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆ భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. రసానికి సాంబారుకు ఏం తేడా లేదని, అన్నం బాగాలేదని ఆగ్రహించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేసిన ఆయన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయని అడిగారు. చాలా వరకు మందులు, మాత్రలు బయట తీసుకుంటున్నామని చెప్పారు. బాత్ రూముల్లో నీళ్ల సక్రమంగా రావడం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. చాలా వరకు రక్త పరీక్షలు, స్కానింగ్‌కూ ప్రైవేటుకు రాసిస్తున్నారని చెప్పారు.

నెలలో మార్పు కనిపించాలి

తాను నెల తర్వాత మళ్లీ వస్తానని, అప్పటికి మార్పు లేకుంటే నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని యాజమాన్యాన్ని గురజాల హెచ్చరించారు. పేదలకు మెరుగైన వైద్యం అందుతుందనే ప్రభుత్వాస్పత్రిని అపోలోకు ఇచ్చారని గుర్తుచేశారు. ఇకపై మొత్తం మారాలని, లేకుంటే తాను మారుస్తానని తెలిపారు. ఆయన వెంట నగరపాలక కమిషనరు అరుణ, అపోలో హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, ఆర్‌ఎంవో సంధ్య తదితరులు ఉన్నారు.

అన్నప్రసాదంలో నాణ్యత పెంచండి



టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగ కార్యకలాపాలను బుధవారం ఆయన సమీక్షించారు. గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, అధికారులతో కలిసి అన్నప్రసాద విభాగంపై ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అక్షయ కిచెన్, పీఏసీ2తో పాటు ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథిగృహం సహ తిరుమలలోని అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలపై ఈవో సమీక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలన్నారు. సగటున రోజుకు 1.75 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరిస్తుండగా, తిరుపతిలో 17 వేలు, వారాంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేల మంది స్వీకరిస్తున్నట్టు అధికారులు వివరించారు. మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని ఈవో సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పెంచడంతో పాటు డిమాండ్‌కు దీటుగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాల అమలుపై పక్కా ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ల కొనసాగింపు : ఎస్పీ



జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19: జిల్లాలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై గట్టి నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం సబ్ డివిజన్ అధికారులతో ఆయన నేర సమీక్షా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లను కొనసాగించాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు పాల్గొన్నారు. పోలీసు అతిథి గృహంలో సెంట్రల్ క్రైం పోలీసులతో కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. పదే, పదే నేరాలు చేస్తున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీసు గ్రౌండులో డీఎస్పీ రమణకుమార్‌తో పాటు అదనపు ఎస్పీలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ట్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనంగా 20 మంది హోం గార్డులను నియమిస్తున్నట్లు చెప్పారు.

తిరుపతిలో ఎంతో నేర్చుకున్నా

● బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్
● గనుల శాఖ కమిషనర్‌గా ప్రమోషన్
● ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర



ప్రవీణ్‌కుమార్ - ధ్యానచంద్ర

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. తదుపరి కలెక్టర్ నియమితులయ్యే వరకూ జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఇంఛార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ప్రవీణ్ కుమార్ ప్రాధాన్యత కలిగిన మైన్స్ అండ్ జియాలజీ శాఖకు కమిషనర్ మరియు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులోనూ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.గత ఏప్రిల్‌లో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదలయ్యాక అప్పటి కలెక్టర్ లక్ష్మీశ పనితీరు పట్ల అసంతృప్తితో ఎన్నికల కమిషన్ ఆయనపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో జిల్లా కలెక్టర్ పోస్టు కోసం సీఎస్ ప్రతిపాదించిన ముగ్గురు అధికారుల్లో ఈసీ ప్రవీణ్ కుమార్ నియామకాన్ని ఆమోదించింది. దీంతో గత ఏప్రిల్ 4న కలెక్టర్‌గా, జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్న ప్రవీణ్ కుమార్ ఎన్నికల నిర్వహణలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినా, మరుసటి రోజు స్ట్రాంగ్ రూములున్న పద్మావతీ వర్సిటీ ఆవరణలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థిపై భయానక దాడి జరిగినా... కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనితీరు పట్ల ప్రతిపక్షాల నుంచీ ఎలాంటి ఫిర్యాదులూ, ఆరోపణలు, విమర్శలు రాలేదు. నిష్పాక్షికంగా పనిచేశారన్న అభిప్రాయం ప్రభుత్వ పెద్దల్లో వుండడంతోనే తాజా బదిలీల్లో ఆయనకు కీలకమైన మైన్స్ అండ్ జియాలజీ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ పోస్టు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలకరించగా శ్రీవారు కొలువైన తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అత్యంత క్లిష్టమైన ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చానని, అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా సహకారంతో సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించగలిగానన్నారు. గతంలో కీలకమైన వైజాగ్ సహా మూడు జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసినా తిరుపతిలో ప్రోటోకాల్ విధులు సహా ఎంతో నేర్చుకున్నా అన్నారు. ఈ జిల్లాలో ప్రతి ఐఏఎస్ అధికారీ నేర్చుకోవాల్సింది ఎంతో వుందని భావిస్తున్నానన్నారు. పనిచేసింది రెండున్నర నెలల స్వల్ప సమయమే అయినా కల్మషం లేకుండా ప్రశాంతంగా వుండే ఇక్కడి ప్రజలు అందించిన సహకారం మరవలేనంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేను బడికి పోతా.. పురోగతి ఏదీ?

అధికారుల ఉదాసీనత ● ఆరు రోజుల్లో బడిలో చేర్చింది ఒకరినే

చిత్తూరు (సెంట్రల్), జూన్ 19: బడిబయటి పిల్లల్ని బడిలో చేర్పించడంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమగ్రశిక్ష అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 13 నుంచి జూలై 12 వరకు కార్యక్రమం నిర్దేశించారు. కాగా 13 నుంచి 18వ తేది వరకు ఆరు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విద్యాశాఖలో ప్రధానమైన సమగ్రశిక్ష ద్వారా ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. విద్యాశాఖతో పాటు పంచాయతీరాజ్, కార్మికశాఖ, ఏటీడీఏ, ఏసీడీఎస్, ట్రైబల్, సోషల్, బీసీ, మైనారిటీ వెల్ఫేర్, మెప్మా, కేజీబీవీ శాఖలను సమన్వయం చేసుకుని 6-14 ఏళ్లలోపు బడిబయటి, బడిమానేసిన పిల్లల్ని బడిలో చేర్పించాల్సి ఉంది. ఈ విషయంలో సమగ్ర శిక్ష అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో పెనుమూరు, వెదురుకుప్పం మండలాల్లో ఒక్కొక్కరిని గుర్తించగా, వెదురుకుప్పంలోని పిల్లాడు మాత్రమే మంగళవారం బడిలో చేరాడు. ఇకనైనా అధికారులు స్పందించి జూలై 12వ తేది వరకు జరగనున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా రూ.5.41 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది.మంగళవారం 75,125 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,140 మంది తలనీలాలు సమర్పించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 19: తిరుపతి కేంద్రంగా భారత, ఆంధ్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ న్యూట్రీషియన్ కోర్సులకు దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.కోర్సుపూర్తయ్యాక ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటళ్లు, ప్రముఖ స్టార్‌హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపికైనవారికి హాస్టల్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604 నంబర్లలో సంప్రదించాలని అయన కోరారు.

ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయండి

బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 19: టీటీడీ పూర్వపు ఈవో ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయాలని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సకలశాఖ అధిపతిగా టీటీడీలో పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డి ప్రస్తుత ఈవో శ్యామలరావుకు బాధ్యతలు అపగించే సమయంలో ఫోటోలను మీడియాకు పంపవద్దని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబంధల ప్రకారం ఆలయ మర్యాదల ప్రకారం మేల్‌చాట్ మర్యాద చేసి పంపడం ఆనవాయితీ అన్నారు. ధర్మారెడ్డి ఉద్యోగ విరమణ ఈ నెల 30 వరకు ఉన్న నేపథ్యంలో ఎవరికి తెలియకుండా ఆలయంలో మర్యాదలు చేయించుకుని అర్చకులు వేసిన మేల్‌చాట్ వస్త్రాన్ని భుజంపై వేసుకుని హుందాగా రాకుండా లారీలో సామాన్లు సర్దుకుని పలాయనం చిత్తగించడం శ్రీవారి లీల అన్నారు. మీడియా కన్ను తప్పించుకున్నా భగవంతుని కోర్టులో తప్పించుకోలేరన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం

గ్రామాల్లో విచ్చవిడిగా బెల్టు షాపులు


గుడుపల్లె మండలం సరిహద్దు కర్ణాటకలో ఉన్న మద్యం షాపులు

గుడుపల్లె, జూన్ 19: గుడుపల్లె మండలంలో కర్ణాటక మద్యం ఏరులైపారుతోంది. మండలంలో మద్యం షాపు ప్రజలకు అందుబాటులో లేదు. కుప్పం సమీపంలో ఓ దుకాణం ఉంది. అలాగే కుప్పంలో మద్యం దుకాణాలు ఉన్నాయి. అక్కడ మద్యం ధరలు అధికంగా ఉన్నాయి. దీంతో మందుబాబులు తక్కువకు లభ్యమయ్యే కర్ణాటక మద్యం కోసం అక్కడి సరిహద్దు దుకాణాల వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో మందుప్రియుల వ్యసనాన్ని ఆసరాగా చేసుకుని మండలంలో బెల్టుషాపులు వెలిశాయి. ఇక్కడికి కర్ణాటక మద్యం తెచ్చి అనధికారికంగా విక్రయిస్తున్నారు. వైసీపీ మద్దతుదారులు ఈ బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. నాయకుల అండదండలతో ఉండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గుడుపల్లె మండలం సాలచింతనపల్లె సమీపంలోని కర్ణాటకలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇది సరిహద్దు కావడంతో ఆ షాపుల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లోని బెల్టు షాపులకు ప్రతి రోజూ లక్ష విలువ చేసే మద్యాన్ని కారులు, ఆటోల్లో, ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్నారు. గ్రామాల్లోని బెల్టు షాపులు కర్ణాటక మద్యాన్ని బహిరంగంగా మందుబాబులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కర్ణాటక మద్యం విక్రయాలను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారనే ఆరోపణలున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేస్తే అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. గ్రామాల్లో బెల్టు షాపులు ఉండటం వల్ల శాంతి భద్రతల సమస్య నెలకొందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టుషాపుల తొలగించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నైతిక విలువలు ముఖ్యం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, జూన్ 19: నర్సింగ్ వృత్తిలో నైతిక విలువలు, మానవత్వం ముఖ్యమని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్‌ఆర్. కృష్ణారావు, పీఈ ఎస్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుల్‌మోజీలు అన్నారు. పీఈఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బుధవారం వార్షిక ల్యాంప్ లైటింగ్ సెరిమని నిర్వహించారు. 2023-24 సంవత్స రంలో ప్రవేశం పొందిన నర్సింగ్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ ప్రారంభానికి గుర్తుగా ఈ వేడుకను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవ చేయడంలో ఆనందాన్ని పొందే లక్షణం కలిగి ఉండాలని చెప్పారు. నర్సులు లేకుండా ఆరోగ్య సంరక్షణ అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డేనియల్, నర్సింగ్ సూపరిటెండెంట్ సుభాష్ సింగే, వివిధ విభాగాల అధిపతులు, నర్సింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజల అభ్యున్నతికి సీఎం కృషి


ఎమ్మెల్సీ కంచర్లను సన్మానిస్తున్న వెంకటేశ్

కుప్పం, జూన్ 19: రాష్ట్రంలోని బలిజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలోని స్వగృహంలో బలిజ సంఘం అధ్యక్షుడు, డీలర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆ కులస్తులు ఆయనను కలిసి శాలువ, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కులానికీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులను, విధులను కేటాయించి ఆయా కులాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబు అందుకు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు డీలర్ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నాగభూషణం, కృష్ణమూర్తి, కుల పెద్దలు వేపూరు చలపతి, కుంజేగానూరు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, శివరాయల్, కంగుంది మురుగేశ్, శేషగిరి, రాజేంద్ర, మార్వాడ శివ, నాయనూరు చిన్న, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్వాడీ కేంద్రం కోసం సర్వే


తల్లిదండ్రులతో చర్చిస్తున్న అజయ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ బాలసుందరం

పలమనేరు, జూన్19 : పలమనేరు మున్సిపాలిటీలోని షికారి కాలనీలో అధిక సంఖ్యలో బడిఈడుపిల్లలు, చిన్న పిల్లలు ఉండడంతో అక్కడ ప్రాథమిక పాఠశాల లేదా అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు ఈ నెల 22వ తేదీ శనివారం సమగ్ర సర్వే నిర్వహిస్తామని జిల్లా సెక్టోరల్ అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంఈఓ బాలసుందరంతో కలిసి 'నేనూ బడికి పోతా' కార్యక్రమం లో భాగంగా షికారి కాలనీలో ఆయన పర్యటించారు. బడిపోని విద్యార్థుల సర్వే చేపట్టారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్ర ఏర్పాటు కోసం ప్రతి పాదనలు పంపుతామని వివరిం చారు. ● ఎంబీఎస్ కాలనీలోనూ 'నేనూ బడికి పోతా' కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బాలాజి, బొమ్మిదొడ్డి పాఠశాల ఉపాధ్యాయులు రజాక్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

శాంతిపురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



శాంతిపురం, జూన్ 19 : శాంతిపురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'చినుకుపడితే శాంతిపురం చిత్తడే' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు స్పందించారు. శాంతిపురంలో పూడుకుపోయిన మురుగు కాలువలను శుభ్రపరిచాలని, ఆక్రమణకు గురైన కాలువలను తొలగించి వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కెనమాకులపల్లె పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌నారాయణకు సూచించారు. అనంతరం కార్యదర్శితో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో కేజీఎఫ్ రోడ్డు వెంట నిల్ల ఉన్న వరదనీటిని పొలారుకు మళ్లించారు. అలాగే సినిమా థియేటర్ పక్కన డ్రైనేజీలోని చెత్తను తీయించారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తాం


విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

శాంతిపురం, జూన్ 19 : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు అన్నారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో మండల అంగన్వాడీ కార్యకర్తలు పార్టీ అధ్యక్షుడును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సునంధ, రేవతి, టీడీపీ నాయకులు భాష్కర్, గోపాల్, బాలు, ఈడిగ రమేష్, విజయకుమార్, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి


ఎంపీడీవో ఈశ్వరన్‌ను కలిసిన జనసేన నేతలు

రామకుప్పం జూన్ 19 : ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేలా చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు హరీష్ ఎంపీడీవో ఈశ్వరన్నను కోరారు. బుధవారం ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన నాయకులు ఎంపీడీవోను కలిశారు. సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజా సమస్యలను సకాలంలో పరిష్క రిం చాలని కోరారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత సీతాపతిస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీకాంత్, పవన్, గంగాధర్, భాస్కర్, సురేష్, ఈశ్వర్, హరీష్, గజేంద్ర, మునెప్ప, మహేష్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి మంచిరోజులు


ఆలయ ఎదుట కొబ్బరికాయులు కొట్టిన టీడీపీ శ్రేణులు

రామకుప్పం, జూన్ 19 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని కుప్పం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, మాజీ సర్పంచ్ రామక్రిష్ణప్ప అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో బుధవారం రామకుప్పం శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద శివాజీ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త శ్రీరాములు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం బాలరాజు, సుబ్రీ, అవినాష్, అంజి, చలపతి, నియాజ్, అక్బర్, సాబ్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన ఉద్యోగులకు పోస్టింగ్


నియామక పత్రాలు అందిస్తున్న అధికారులు

కుప్పం, జూన్ 19: ఎన్నికల నిబంధనలను అతిక్రమించారనే ఆరోపణలతో ఎన్నికల సమయంలో సస్పెండ్ అయిన కుప్పం ఆర్టీసీ డిపో కండెక్టర్ జి.గోవిందరాజులు, డ్రైవర్ ఎస్.అఫ్సర్ బాషాలకు తిరిగి అదే డిపోలో పోస్టింగ్ ఇచ్చారు. కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరు సి.పెంచులయ్య, అసిస్టెంట్ మేనేజర్ బీవీ.లక్ష్మణరావులు వీరిద్దరినీ బుధవారం విధుల్లో చేర్చుకున్నారు. ఇందుకోసం కృషిచేసిన ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్ కుమార్, డిపో కార్యదర్శి ఇ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్పల సమక్షంలో ఈ చేరిక జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యానికి, సహకరించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్‌లకు యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడిగా మధుసూదన్ ఎంపిక



పుంగనూరు రూరల్, జూన్19: పుంగనూరు తాలూకా బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడిగా మధుసూదన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామమూర్తి తెలిపారు. బుధవారం జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో నూతన గౌరవ అధ్యక్షున్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సల్మాబేగం

పుంగనూరు రూరల్, జూన్19: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు అధికంగా ఉన్నాయని, అందువల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా విద్యార్థులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సల్మాబేగం సూచించారు. బుధవారం నేతిగుట్లపల్లె సచివాలయంలో ప్రజలు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇళ్ల చుట్టు పక్కల వర్షపు నీరు నిల్వ లేకుండా, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన వారు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. వాంతులు, విరేచనాలు కలిగినప్పుడు ఏఆర్‌ఎస్ ద్రావణం ఎలా తయారు చేసి తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినం

పుంగనూరు, జూన్19: కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాసర్కిల్లో ప్రియాంకగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సజ్జాద్ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు.

మంత్రులను కలిసిన పుంగనూరు టీడీపీ నాయకులు



పుంగనూరు రూరల్, జూన్ 19: మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, హోం మంత్రి అనితలను పుంగనూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి వెంకటరమణరాజు, మురాది దినేశ్‌లు బుధవారం కలిశారు. విజయవాడలో వారిని కలిసి దుశ్శాలువలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

గంగమ్మ ఉత్సవర్ల ఊరేగింపు

గుడుపల్లె, జూన్ 19: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో వెలిసిన గంగమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం గంగమ్మ, మారెమ్మల ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామదేవత గంగమ్మ మూల విగ్రహానికి అర్చకులు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం గంగమ్మ, అగ్ని మారెమ్మ ఉత్స వర్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. మహిళలు అమ్మవార్లకు కర్పూర హారతులు పట్టారు. మహిళలు పిండి దీపాలు వెలిగించారు. వర్షాలు కురవాలని, పంటలు పండాలని మొక్కుకున్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జూన్ 19: కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన శ్రీహాన్‌ఆర్య బుధవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సమస్యలు 24 గంటల్లో పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు

కుప్పం, జూన్ 19: జిల్లాలో ఇక విద్యుత్తు సమస్యలపై ఎటువంటి ఫిర్యాదులు అందినా 24 గంటల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు చెప్పారు. కుప్పం రెస్కో కార్యాలయంలో బుధవారం ఆయన నియోజక వర్గంలోని విద్యుత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో గ్రీవెన్స్ రిజిస్టర్ నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు ఫోన్ చేసి ఎటువంటి సమస్య చెప్పినా, ఈ రిజిస్టర్‌లో నమోదు చేస్తామన్నారు. ఫిర్యాదు అందినప్పటి నుంచి 24 గంటల్లోగా ఆ సమస్యను గుర్తించి, పరిష్కారానికి ప్రయత్ని స్తామ న్నారు. రెస్కో పరిధిలో ఇకమీదట ఎటువంటి విద్యుత్తు సమస్యలు లేకుండా చూసుకుంటా మన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యాన్ని వీడాలని ఆదేశించారు. సహకార వ్యవస్థ ద్వారా రెస్కోను నిర్వహిస్తున్నారని, దానికి తగ్గట్టుగా సేవలు ఉండాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులతోపాటు రెస్కో ఎండీ ప్రభాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టువారిపల్లెలో ఘనంగా గంగజాతర



సోమల, జూన్ 19: సోమల మండలం గట్టువారిపల్లెలో బుధవారం గంగజాతర వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు మంగళవారం రాత్రి జాగరణ చేస్తూ పొలిమేర అమ్మవార్లకు దీలు, బోనాలు చెల్లించారు. ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టారు. బుధవారం ఉదయం నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు మహిళలు ప్రదర్శనగా బోనాలు తీసుకెళ్లారు. ఆసాదివారు అమ్మవారి జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం బలిపోతును బలిదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పుంగనూరు నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, మునీశ్వర రావు, రమేశ్ నాయుడు, మహేంద్రబాబు, సూరిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం అందించాలి


రొంపిచెర్లలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

రొంపిచెర్ల, జూన్ 19: మండలంలోని పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సోమల ఏడీఏ శ్రీనివాసులునాయుడు పశు వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, బోడిపాటి వారిపల్లె, రొంపిచెర్ల, బొమ్మ య్యగారిపల్లె ఆర్బీ కేలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రొంపిచెర్ల పశువైద్య శాలను సందర్శించారు. రికార్డులు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన వైద్యం, పోషకాహారంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత వర్షాలకు వచ్చే వ్యాధులకు చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రొంపిచెర్ల పశువైద్యాధికారి శ్రీధర్, అరుణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

రామకుప్పం, జూన్ 19 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రామకుప్పం తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరన్‌లు కోరారు. 'నేనూ బడికి పోతా' కార్యక్రమంపై బుధవారం పట్టణ వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయన్నారు. అలాగే చదువుకునే ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం 'అమ్మకు వందనం' పథకం ద్వారా రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందించనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారాయణ ఈవోపీఆర్డీ రాధాకృష్ణ, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మొక్కలు నాటుతున్న టీడీపీ, జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, జూన్19: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పుంగనూరు టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రజాప్రతినిధులు ప్రమాణా స్వీకారం సందర్భంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ పరిధిలో టీడీపీ, జనసేన నాయకులు అధికసంఖ్యలో మొక్కలు నాటి కాలుష్య నివారణకు కృషి చేయాల్సిన బాధ్యత తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివయ్య, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, వెంకటరెడ్డి, ప్రసాద్, జనసేన నాయకులు పగడాల రమణ, నరేశ్‌రాయల్, చైతన్యరాయల్, హరినాయక్, శ్రీనివాసులు, మురళీ, పోలీసులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రజా పరిపాలన జరగాలి


టీడీపీ జెండా ఆవిష్కరణ చేస్తు టీడీపీ నేతలు

శాంతిపురం, జూన్ 19 : గ్రామ సచివాల యా ల్లో ఇక నుండి ప్రజా పరిపాలన సాగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనెకర పంచాయతీ చంద్రగిరి క్రాస్‌లో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలోకి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి నదమూరి తారకరామారావు ఫొటోలను ఆవిష్కరించారు. అక్కడే సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం మండల నాయకులను అనెకర పంచాయతీ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, సుబ్రమణ్యం, రమేష్, బీరప్ప, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఏఎంసీ నాగరాజు, లోకేష్, టీఎం రామక్రిష్ణారెడ్డి, సుబ్బు, మంజునాథ్, మురళి, శ్యామల, అనుసూయ, రూప, సుగునమ్మ, వేద పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలిద్దాం

కల్లూరు, జూన్ 19: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలిద్దామని ప్రభుత్వ వైద్యాధికారి జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి జన్యుమార్పుల మూలంగా వంశపారంపర్యంగా సంక్రమిస్తుందన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ల పసుపురంగులో మారడం, తీవ్రమైన ఒళ్లనొప్పులు, అలసట వంటి లక్షణాలు ఉంటాయన్నారు. 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టకున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బలి బండి ఘట్టం



కల్లూరు, జూన్ 19: పులిచెర్లలో కొనసాగుతున్న మహభారత యజ్ఞంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన బకాసురుడి బలి బండి ఘట్టం అందరినీ ఆకట్టుకుంది. బలి బండితో బకాసురుడి వేష ధారణలో పలు గ్రామాల్లో డప్పుల నడుమ ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. ఇంటింటా ప్రజలు నైవేద్యం సమర్పించారు. బడి బండి ఉభయదారులుగా కొక్కువారిపల్లికి చెందిన లెక్కల ధనంజయనాయుడు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

● ఆకట్టుకున్న కర్ణ జననం హరికథ

కల్లూరులో కొనసాగుతున్న మహభారత యజ్ఞంలో భాగంగా బుధవారం హరికథ భాగవతారిణి గీతావాణి వినిపించిన కర్ణ జననం హరికథ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. హరికథకు ఉభయదారులుగా మేకలవారి పల్లికి చెందిన మల్లికార్జున కుటుంబసభ్యులు వ్యవహరించారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

పలమనేరు, జూన్19 : గంగవరం మండలంలోని కురప్పల్లి సమీపంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీఐ చిన్నగోవిందు సీజ్ చేశారు. రూ.10వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇసుక సీజ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



సోమల, జూన్ 19: సోమల పంచాయతీ చెన్నయ్యగారి పల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త చిట్టి బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈక్రమంలో టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీఎం.మల్లికార్జున, పీ.శివశంకర్, మహేంద్రబాబు, అడుసుపల్లె మణి, చాణుక్య పాల్గొన్నారు.

వారపు సంతలకు వేలం

సోమల, జూన్ 19: సోమల మండలంలోని కందూరు మేజర్ పంచాయతీకి వారపు సంత వేలం పాటలతో రూ.5,15,000, బస్టాండ్ గేటుకు రూ.71,500 ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి జయశంకర్ తెలిపారు. అలాగే నంజంపేట వారపు సంత ద్వారా రూ.1.01 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. ఏప్రిల్ నెలలో నిర్వహించాల్సిన వేలం పాటలు ఎన్నిక కోడ్‌తో వాయిదా పడడంతో బుధవారం వేలం పాటలు నిర్వహించినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు.


బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివప్రసాద్

చౌడేపల్లె, జూన్19: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంపీడీవో శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడారు. .6 నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతిఒక్కరూ బడిలోనే ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూలై 12 వరకు ఈ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కేశవరెడ్డి, తిరు మలమ్మ, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌ఎంటీలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

రామకుప్పం, జూన్ 19 : పీఎం జన్ మన్ - పీఎం జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్య క్రమంలో భాగంగా రామకుప్పం శివార్లలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధి కారి లోకేష్ తన సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులకు రక్త హీనత ఉన్నట్లు గుర్తించారు. మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.







దోమల దండయాత్ర

- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు

పెనుమూరు, జూన్ 19 : వర్షాలతోపాటు దోమల బెడద ఎక్కువైంది. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా దాడి చేస్తూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో వర్షపు నీటి నిల్వలు, పారిశుధ్య లోపం కారణంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. గతంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద గ్రామ సచివాలయాలకు రూ.30వేల నుంచి రూ.60 వేలు వెచ్చించి ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. వీటిపై సిబ్బందికి శిక్షణ ఇవ్వకపోవడం, మలాథిన్, పెట్రోల్, డీజిల్ మిశ్రమం అందించకపోవడంతో మూలనపడేశారు.

తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తాం

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తాం. పారిశుధ్య చర్యలు చేపడతాం. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

- మహేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, పెనుమూరు


మరంపల్లిలో రోడ్డుపై నిలిచిన నీరు

ముగిసిన గంగమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 19: న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో రెండు రోజులుగా జరుగుతున్న నడివీధి గంగమ్మ జాతర బుధవారంతో ముగిసింది. చివరి రోజు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, నైవేద్యం పెట్టారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. మహిళలకు అమ్మవారి పసుపు కుంకుమ, జాకెట్టుతో వాయనం అందజేశారు. రాత్రి అమ్మవారిని విశేష అలంకారంలో ఊరేగించారు. ఓంశక్తి భక్తులు శరీరాలకు శూలాలు గుచ్చుకుని ఆటోలు, ట్యాక్సీలు, లారీలు లాగుతూ వచ్చి



అమ్మవారికి పూలమాల సమర్పించి జాతర ముగించారు. దాతలు తాగు నీరు, మజ్జిగ, పండ్లరసం పంపిణీ చేశారు.

మంత్రి రవీంద్రను కలసిన షణ్ముగం

చిత్తూరు సిటీ, జూన్ 19: రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ అండ్ జియాలజి శాఖ మంత్రి కొల్లు రవీంద్రను టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ షణ్ముగం కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మచిలీపట్నంలోని మంత్రి నివాసంలో కలసి తిరుమల శ్రీవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

ఓటమిని ప్రజలపై నెట్టేయడం బాధాకరం : టీడీపీ

చిత్తూరు సిటీ, జూన్ 19: ఓటమిపై వైసీపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోకుండా ఆ నెపాన్ని ప్రజలపై నెట్టేయడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చిత్తుగా ఓటమిపాలైన మాజీ సీఎం జగన్ ఈవీఎంలపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదని, ఎవరో ఏమో చేశారని, కాని అందుకు ఆధారాలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి ఓట్లు ఏమయ్యాయని అక్కసు వెళ్లగక్కడం సిగ్గు చేటన్నారు.









'నేను బడికి పోతా' విజయవంతం చేయండి

పాలసముద్రం, జూన్ 19: 'నేను బడికి పోతా' కార్యక్ర మాన్ని విజయవంతం చేయా లని ఎంపీడీవో రామనాథరెడ్డి కోరారు. బడి మానేసిన 6-14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

కృష్ణమూర్తికి పలువురి నివాళులు

గుడిపాల, జూన్ 19: మండలంలోని కుప్పిగా నిపల్లెకు చెందిన కృష్ణమూర్తి క్యాన్సర్ వ్యాధితో బుధవారం మరణించారు. టీడీపీ, వైసీపీ నాయకులు నివాళులర్పించారు. ఇందులో జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, వైసీపీ సర్పంచ్ మధుసూదన్ రాయల్ ఉన్నారు.

రాహుల్‌తోనే దేశాభివృద్ధి

నగరి, జూన్ 19: కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం రాహుల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ బాబు, పీసీసీ సభ్యుడు నటరాజ మొదలియార్, డీసీసీ జనరల్ సెక్రటరీ దేశయ్య, నాయకులు చిరంజీవిరెడ్డి, నాగేశ్వరరావు, కుమార్, గిరి, లోహిత రాజు, కార్తీక్, సుబ్రమణ్యంరెడ్డి, గుణ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా గంగమ్మ జాతర

గుడిపాల, జూన్ 19: మండలంలోని బొమ్మసముద్రం క్రాస్‌లో బుధవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అంబళ్లు పోసి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, దొరబాబు, మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి

పాలసముద్రం, జూన్ 19: విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని, అక్కడ మాత్రమే నాణ్యతతో కూడిన విద్య ఉంటుందని ప్రిన్సిపాల్ హేమలత కోరారు. పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల రాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం ఆమె మాట్లాడారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, పుస్తకాలు ఉచితంగా ఇస్తారని వివరించారు.









గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 19: కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన శ్రీహాస్‌ఆర్య బుధవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏపీఆర్వో పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పూతలపట్టు, జూన్ 19: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు కోరారు. బుధవారం ఆయన పూతలపట్టు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న మౌళిక సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

హోంమంత్రికి శుభాకాంక్షలు



పెనుమూరు, జూన్ 19: హోం మంత్రిగా అనిత బుధవారం అమరావతిలో బాధ్యతలు చేపట్టారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు కృషి చేయాలని కోరానన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల సేవలు భేష్

చిత్తూరు, జూన్ 19: ఎన్నికల సమయంలో ఎన్‌సీసీ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఎస్పీ మణికంఠ అన్నారు. బుధవారం ఎన్‌సీపీ 35వ బెటాలియన్ శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ యువ జవాన్లుగా ఎన్‌సీసీ విద్యార్థులు దేశభక్తితో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ, ఓటర్లకు సహాయ పడటం వంటి సేవలలో వారు ముందున్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్పీని ఎన్‌సీసీ అధికారులు సన్మానించారు. ఎన్‌సీసీ కల్నల్ వివేక్ మోనిక్, మేజర్ లోకనాథన్, సబ్ మేజర్ చెత్రి, ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎస్పీ మణికంఠ

గతుకుల రోడ్డుతో నరకయాతన

బంగారుపాళ్యం, జూన్ 19: మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రహదారి గతుకులమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయమవుతోందని వాహనదారులు వాపోతున్నారు. గోవర్ధనగిరి, రాగిమానిపెంట, వెలుతురుచేను, వేపనపల్లి, కీరమంద, కొదలమడుగు, బండ్లదొడ్డి, తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

ఐరాల, జూన్ 19: డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐరాల ప్రభుత్వాసుపత్రి వైద్యులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. పేరయ్యగారిపల్లెలో బుధవారం డెంగీ కేసు నమోదు కావడంతో ఆయన తన సిబ్బందితో కలసి గ్రామానికి వెళ్లి కారణాలను పరిశీలించారు. పూలకుండీలలో నీటి నిల్వలను తొలగించాలన్నారు. పాతటైర్లు ఎక్కడబడితే అక్కడ వేయరాదన్నారు. దోమల నివారణకు రసాయనాలతో పాటు ఎండు వేపాకు పొగ వేయాలని సూచించారు. అనంతరం జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో అబెట్ రసాయనాన్ని పిచికారీ చేయించారు. పీహెచ్ఈఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



వెదురుకుప్పం, జూన్ 19: చవట గుంట మహాభారత ఉత్సవాలకు బుధ వారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వ హించారు. చవట గుంటకు చెందిన బండి ఆనందరెడ్డి, సత్యమ్మ దంపతులు, సౌజన్య, జయప్రసాద్‌రెడ్డి, రాజేశ్వరి, పద్మనాభరెడ్డి, పేట శ్రీదేవి, ఢిల్లీప్రసాద్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ధ్వజస్తంభ పూజ చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల కోసం హరికథా కాలక్షేపం, వీధినాటకాలు ఏర్పాటు చేశారు.

సచివాలయ ఉద్యోగులకు చంద్రబాబు చిత్రపటం



వెదురుకుప్పం, జూన్ 19: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ ఉద్యోగులకు టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి బాబునాయుడు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని బుధవారం అందించారు. కార్యాలయంలో తగిలించుకోవాలని కోరారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దద్దల బాబునాయుడు, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వం అవసరం : టీఎన్‌టీయూసీ



వెదురుకుప్పం, జూన్ 19: రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి బాబునాయుడు అన్నారు. బుధవారం నల్లవెంగనపల్లె పంచాయతీలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. జనసేనాని పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించినందుకు కేక్ కట్ చేశారు. దద్దల బాబునాయుడు, రజనీకాంత్, వరప్రసాద్, కుమార్, విక్రమ్‌రెడ్డి, జనార్దన్, చిరంజీవి, రాము, అనిల్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 19: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు హనుమంతు వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ అనంతరం హనుమంత వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

'సూర్యనారాయణపై ఆరోపణలు తగవు'

చిత్తూరు రూరల్, జూన్ 19: ఏపీ వాణిజ్యపన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై అసత్య ఆరోపణలను ఖండిస్తున్నామని అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు పూర్ణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడడం కోసం నిరంతరం పోరాడుతున్న ఆయనపై ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా వాటిని మానుకోవాలని కోరారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు



బంగారుపాళ్యం, జూన్ 19: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు బుధవారం రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. 0-40 సంవత్సరాల మధ్య వారు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ లోహిత్ చెంగ్రాయన్, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యతోనే మార్పు



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాత

నగరి, జూన్ 19: విద్యతోనే మార్పు సాధ్యమవుతుందని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. బుధవారం నెత్తం కండ్రిగ మండల ప్రాథమిక పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఎం.రమేష్ విద్యార్థులకు రూ.4 వేలు విలువచేసే విద్యా సామగ్రిని వితరణగా అందించారు.

భారీగా ఎమ్మెల్యే జన్మదిన ఏర్పాట్లు

నగరి, జూన్ 19 : నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ 49వ జన్మదినోత్సవానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ వ్యాప్తంగా బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు దేశమ్మ ఆలయం ఎదురుగా ఉన్న టెక్స్‌టైల్స్ పార్కు స్థలంలో జన్మదిన సంబరాలు నిర్వహించనున్నట్లు నేతలు తెలిపారు.



నగరిలో భానుప్రకాష్ కటౌట్


నగరి మండలం ఐనంబాక్కంలో బుధవారం జరిగిన జాతరలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానిస్తున్న గ్రామస్తులు

గట్టువారిపల్లెలో ఘనంగా గంగజాతర

సోమల, జూన్ 19: సోమల మండలం గట్టువారిపల్లెలో బుధ వారం గంగజాతర వేడుకలు ఘనం గా జరిగాయి. మహిళలు మంగళ వారం రాత్రి జాగరణ చేస్తూ పొలి మేర అమ్మవార్లకు దీలు, బోనాలు చెల్లించారు. ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టారు. బుధవారం ఉదయం నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు మహిళలు ప్రదర్శనగా బోనాలు తీసుకెళ్లారు. ఆసాదివారు అమ్మవారి జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం బలిపోతును బలిదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పుంగనూరు నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, మునీశ్వర రావు, రమేశ్ నాయుడు, మహేంద్రబాబు, సూరిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బలి బండి ఘట్టం



కల్లూరు, జూన్ 19: పులిచెర్లలో కొనసా గుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన బకా సురుడి బలి బండి ఘట్టం అందరినీ ఆకట్టు కుంది. బలి బండితో బకాసురుడి వేష, దారణలో పలు గ్రామాల్లో డప్పుల నడుమ ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. ఇంటింటా ప్రజలు నైవేద్యం సమర్పించారు. బడి బండి ఉభయదారులుగా కొక్కువారిపల్లికి చెందిన లెక్కల ధనంజయనాయుడు కుటుంబసభ్యులు వ్యవహ రించారు.

● ఆకట్టుకున్న కర్ణ జననం హరికథ

కల్లూరులో కొనసాగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం హరికథ భాగవతారిణి గీతావాణి వినిపించిన కర్ణ జననం హరికథ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. హరికథకు ఉభయదారులుగా మేకలవారి పల్లికి చెందిన మల్లికార్జున కుటుంబసభ్యులు వ్యవహరించారు.

విద్యుత్ సమస్యలు 24 గంటల్లో పరిష్కరిస్తాం

కుప్పం, జూన్ 19: జిల్లాలో ఇక విద్యుత్తు సమస్యలపై ఎటు వంటి ఫిర్యాదులు అందినా 24 గంటల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు చెప్పారు. కుప్పం రెస్కో కార్యాలయంలో బుధవారం ఆయన నియోజక వర్గంలోని విద్యుత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో గ్రీవెన్స్ రిజిస్టర్ నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు ఫోన్ చేసి ఎటువంటి సమస్య చెప్పినా, ఈ రిజిస్టర్‌లో నమోదు చేస్తామన్నారు. ఫిర్యాదు అందినప్పటి నుంచి 24 గంటల్లోగా ఆ సమస్యను గుర్తించి, పరిష్కారానికి ప్రయత్ని స్తామ న్నారు. రెస్కో పరిధిలో ఇకమీదట ఎటువంటి విద్యుత్తు సమస్యలు లేకుండా చూసుకుంటా మన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యాన్ని వీడాలని ఆదేశించారు. సహకార వ్యవస్థ ద్వారా రెస్కోను నిర్వహిస్తున్నారని, దానికి తగ్గట్టుగా సేవలు ఉండాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

పుంగనూరులో కిలో టమోటా ధర రూ.66.70

పుంగనూరు, జూన్ 19: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రైతులు విక్రయాలకు తీసుకువచ్చిన టమోటా ధరకు రెక్కలొచ్చాయి. మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.66.70 పలికింది. గతకొద్దిరోజులుగా వేసవి ఎండతో పంట దిగుబడి తగ్గడం వల్ల టమోటా ధరలు రోజూ రోజూకు పెరుగుతున్నాయి. మంగళవారం కిలో రూ. 60లకు కాగా బుధవారం రూ.66.70కు పెరిగింది. నాణ్యతను బట్టి రెండో రకం కిలో రూ. 62.70లు, మూడవ రకం కిలో రూ. 56.70 చొప్పున 291.82 మెట్రిక్ టన్నులు రైతుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

పల్ప్ రకం కాయలను గుజ్జుపరిశ్రమలకే తరలించాలి


మార్కెట్ యార్డును సందర్శించిన సాగరిక

బంగారుపాళ్యం, జూన్ 19: మామిడి రైతులు పల్ప్ రకమైన తోతాపురిని గుజ్జు పరిశ్రమలకు నేరుగా తరలిస్తే టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అదనంగా పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి సాగరిక అన్నారు. బుధవారం ఆమె స్థానిక మార్కెట్ యార్డును సందర్శించి, అక్కడి రైతులతో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన తర్వాతనే మామిడికాయలను కోయాలన్నారు. అలా కోసిన వాటిని నేరుగా గుజ్జు పరిశ్రమలకు తరలించాలని సూచించారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు


హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూన్ 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,52,94,363 లభించినట్లు ఈవో వెంకటేశు వెల్లడించారు. ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం హుండీ కానుకలను ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. 80 గ్రాముల బంగారు, 3.150 కిలోల వెండి, 904 యూఎస్ఏ, 50 ఆస్ట్రేలియా, 25 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగిట్స్ లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,376, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.27,217 సమకూరాయి. 20 రోజులలో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

● టీచరు సహా పలువురిపై కేసు

వెదురుకుప్పం, జూన్ 19: భార్యాభర్తలపై మారణాయుధాలతో దాడి చేసి, గాయపరిచిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు శశికళ తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిదొనకు చెందిన పి.రాజశేఖర్, శశికళ దంపతులపై ఆదివారం రాత్రి అదే పంచాయతీలోని ఎగువ గెరిగిదొనకు చెందిన ఆర్.హరికృష్ణ(టీచర్), అతని అనుచరులు పి.రాజేష్, సాయి, పుష్ప, వాసు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాజశేఖర్ దంపతులకు గాయాలయ్యాయి. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు సెక్షన్ 324, రెడ్ విత్ 34 ఐపీసీల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో దాడి

వెదురుకుప్పం: పాతకక్షల నేపథ్యంలో 16వ తేదీన తన భార్యాబిడ్డలపై కొందరు దాడి చేశారని ఎగువ గెరిగిదొనకు చెందిన పి.దేవరాజులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరికృష్ణతో దేవరాజులు భార్య ఆదిలక్ష్మికి పొలం వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. గ్రామ పెద్దల జోక్యంతో సర్దుబాటైంది. దాన్ని మనసులో పెట్టుకున్న హరికృష్ణ, దిగువ గెరిగిదొనకు చెందిన అతని బంధువులు వాసు, పుష్ప, సాయి, రాజేష్ కలిసి ఆదిలక్ష్మి, ఆమె పిల్లలపై దాడి చేశారు. ఆదిలక్ష్మి గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతోంది. దీనిపై హరికృష్ణ సహా అనుచరులపై 324, 34ఐపీసీ సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి

చిత్తూరు సిటీ, జూన్ 19: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిందన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తోతాపురి రకానికి టన్నుకు రూ.30 వేలు తగ్గకుండా రైతులకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ జిల్లాలోని గుజ్జు పరిశ్రమల యజమానులకు ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. యాజమాన్యాలు సహకరించి, అన్నదాతకు అండగా నిలవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

తెప్పలపై సిరులతల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, జూన్ 19 : తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మహాలక్ష్మీ అలంకరణలో తిరుచానూరు పద్మావతీ దేవి తెప్పలపై విహరించి భక్తులకు అభయ ప్రదానం చేశారు.మధ్యాహ్నం ఉత్సవమూర్తికి పద్మసరోవరంలోని నీరాడమండపంలో అభిషేకం జరిగింది.శుక్రవారం జరిగే గరుడవాహనసేవతో అమ్మవారి తెప్పోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. డిప్యూటీ ఈవో గోవిందరాజన్,ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే నాని


మామండూరు వద్ద జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదం వద్ద ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించబోయి ఎమ్మెల్యే పులివర్తి నాని మానవత్వం చాటుకున్నారు. చంద్రగిరి మండలం మామండూరు వద్ద బుధవారం టమోటాలను తీసుకెళ్తున్న వ్యాన్ టైర్ పంక్చరై బోల్తా పడింది.డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో పాకాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వాహనాన్ని ఆపారు. వ్యాన్ డ్రైవర్‌ను సిబ్బంది చేత బయటకు తీయించారు. తన వాహనంలోనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందికి సూచించారు. అయితే ఆలోపు హైవే అంబులెన్స్ రావడంతో క్షతగాత్రుడు రజనీని చంద్రగిరి ఆస్పత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే చెర నుంచి క్వారీకి విముక్తి

● ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్న జనార్దన నాయుడు


మాదిగబండ సమీపంలోని క్వారీ - క్వారీలో నాలుగేళ్లుగా బండరాళ్లు తీసేయడంతో ఏర్పడిన గుంత



పలమనేరు, జూన్ 19: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చెరనుంచి క్వారీకి విముక్తి లభించింది. మాదిగబండ గ్రామసమీపంలోని తన క్వారీని జనార్దన నాయుడు స్వాధీనం చేసుకొన్నారు. వివరాలిలా ఉన్నాయి. శాంతిపురం మండలానికి చెందిన జనార్దన నాయుడు పలమనేరు మండలం మాదిగబండ వద్ద చిన్న క్వారీని కొన్నారు. దీని కోసం ప్రత్యేకంగా హెచ్‌లైన్ విద్యుత్ సరఫరా తీసుకున్నారు. క్వారీని కూడా విస్తరింపజేశారు. ఈ క్వారీలో వివిధ సైజుల్లో కంకరను తయారు చేసి రోడ్ల పనులకు, ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తుండేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటేగౌడ గెలుపొందారు. ఈ క్రమంలో ఆయన జనార్దన నాయుడి నుంచి క్వారీని లీజుకని తీసుకొన్నారు. తనకు లీజు సొమ్ము చెల్లించక పోవడంతో పాటు, తాను నెలసరి వాయిదాలతో కొన్న వాహనాలనూ వినియోగించుకొంటూ వాటికి ఈఎంఐలూ చెల్లించలేదని బాధితుడు చాలాసార్లు వాపోయారు. కాగా, తనకు చెల్లని చెక్కు ఇచ్చారంటూ కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ కోర్టులో చెక్ బౌన్సు కేసు వేశారు. తనకు ఇవ్వాల్సిన లీజు డబ్బులు ఇప్పించాలని ఆయన వైసీపీ నేతల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. తన క్వారీని వాడుకోవడంతో పాటు క్వారీకి సంబంధించిన విద్యుత్ ఛార్జీలు కూడా చెల్లించక పోవడంతో లక్షలాది రూపాయలు విద్యుత్ ఛార్జీలు పేరుకు పోయాయని, హెచ్‌టీ విద్యుత్ సరఫరా తీసుకొన్న తాను ఈ మొత్తాలను చెల్లించాల్సి వుంటుందని కావున తనకు న్యాయం చేయాలని కూడా రాష్ట్ర హైకోర్టులోనూ జనార్దన నాయుడు పిటిషన్ వేశారు. ఇంత తతంగం జరిగినా వెంకటేగౌడ తన క్వారీని విడిచి పెట్టలేదని బాధితుడు పేర్కొన్నారు. తన క్వారీ నుంచి రూ.వంద కోట్లకుపైగా జల్లి కొట్టి వివిధ సంస్థలకు, సొంత కాంట్రాక్టు పనులకు, జాతీయ రహదారి పనులకు తరలించి విక్రయించుకొన్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇన్నాళ్లుగా ఆయన ఆవేదనను అధికారులూ పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వారం కిందట తన క్వారీని జనార్దననాయుడు స్వాధీనం చేసుకొన్నారు. కాగా, విద్యుత్ బకాయిలు రూ.2లక్షలు మినహా మిగిలి మొత్తాన్ని ఇటీవల వెంకటేగౌడ క్లియర్ చేశారని జనార్దనాయుడితో పాటు విద్యుత్ అధికారులు తెలిపారు. మొత్తమ్మీద వెంకటేగౌడ చెర నుంచి క్వారీ సొంతదారు చేతికి వెళ్లింది.

ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత




పాలసముద్రం, జూన్ 19: ఫుడ్ పాయిజన్ కారణంగా పాలసముద్రానికి చెందిన వంద మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారు. గ్రామస్థులు, వైద్యాధికారుల వివరాల మేరకు.. మంగళవారం గ్రామంలో గంగజాతర జరిగింది. అమ్మవారికి గ్రామస్తులు అంబలి సమర్పించారు. దాన్ని ప్రసాదంగా స్వీకరించారు. అదే సమయంలో అన్నదానంలో మాంసాహారం భుజించారు. బుధవారం ఉదయం నుంచి చాలామందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మధ్యాహ్నానికి వందమందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. అంగన్‌వాడీ టీచర్ విజయకు అధికంగా విరేచనాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి, డి.టి మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్ గ్రామానికి చేరుకుని తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపించారు. జాతరలో భుజించిన ఆహారం పాయిజన్ కావడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా, తహసీల్దార్ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

రెఫరల్ ఆస్పత్రిగా మార్చేశారు

అపోలో స్థాయిలో అందని వైద్యం ● చిత్తూరు ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయంటూ గురజాల ఆగ్రహం ● నెలరోజుల్లో సరిచేయాలంటూ ఆదేశం


క్యాజువాలిటీలో రోగితో మాట్లాడుతున్న గురజాల

చిత్తూరు రూరల్, జూన్ 19: చిత్తూరు ప్రభుత్వాస్పత్రి (అపోలో).. రెఫరల్ ఆస్పత్రిగా మారిందని రోగుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఆయన ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. చిన్న చిన్న రోగాలకు కూడా తిరుపతి, సీఎంసీ ఆస్పత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే జిల్లా ఆస్పత్రి ఎందుకని ప్రశ్నించారు. డబ్బుల్లేక ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేదలకు.. మందులను బయటకు రాసిస్తే ఎలా కొనగలరని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. క్యాజువాలిటీలో పీజీ విద్యార్థులతో అత్యవసర వైద్యం ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. వారే నేర్చుకోవడానికి వస్తే వారి చేత పేదల ప్రాణాలు పెడుతున్నారా? అని ఆగ్రహించారు. ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే భోజనం తింటే వాంతులు వస్తున్నాయని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆ భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. రసానికి సాంబారుకు ఏం తేడా లేదని, అన్నం బాగాలేదని ఆగ్రహించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేసిన ఆయన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయని అడిగారు. చాలా వరకు మందులు, మాత్రలు బయట తీసుకుంటున్నామని చెప్పారు. బాత్ రూముల్లో నీళ్ల సక్రమంగా రావడం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. చాలా వరకు రక్త పరీక్షలు, స్కానింగ్‌కూ ప్రైవేటుకు రాసిస్తున్నారని చెప్పారు.

నెలలో మార్పు కనిపించాలి

తాను నెల తర్వాత మళ్లీ వస్తానని, అప్పటికి మార్పు లేకుంటే నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని యాజమాన్యాన్ని గురజాల హెచ్చరించారు. పేదలకు మెరుగైన వైద్యం అందుతుందనే ప్రభుత్వాస్పత్రిని అపోలోకు ఇచ్చారని గుర్తుచేశారు. ఇకపై మొత్తం మారాలని, లేకుంటే తాను మారుస్తానని తెలిపారు. ఆయన వెంట నగరపాలక కమిషనరు అరుణ, అపోలో హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, ఆర్ఎంవో సంధ్య తదితరులు ఉన్నారు.

అన్నప్రసాదంలో నాణ్యత పెంచండి


టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగ కార్యకలాపాలను బుధవారం ఆయన సమీక్షించారు. గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, అధికారులతో కలిసి అన్నప్రసాద విభాగంపై ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అక్షయ కిచెన్, పీఏసీ2తో పాటు ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథిగృహం సహా తిరుమలలోని అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలపై ఈవో సమీక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలన్నారు. సగటున రోజుకు 1.75 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరిస్తుండగా, తిరుపతిలో 17 వేలు, వారాంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేల మంది స్వీరిస్తున్నట్టు అధికారులు వివరించారు. మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని ఈవో సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పెంచడంతో పాటు డిమాండ్‌కు దీటుగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాల అమలుపై పక్కా ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ల కొనసాగింపు : ఎస్పీ


జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19: జిల్లాలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై గట్టి నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం సబ్ డివిజన్ అధికారులతో ఆయన నేర సమీక్షా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లను కొనసాగించాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు పాల్గొన్నారు. పోలీసు అతిథి గృహంలో సెంట్రల్ క్రైం పోలీసులతో కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. పదే, పదే నేరాలు చేస్తున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీసు గ్రౌండులో డీఎస్పీ రమణకుమార్‌తో పాటు అదనపు ఎస్పీలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనంగా 20 మంది హోంగార్డులను నియమిస్తున్నట్లు చెప్పారు.

తిరుపతిలో ఎంతో నేర్చుకున్నా

● బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్
● గనుల శాఖ కమిషనర్‌గా ప్రమోషన్
● ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర


ప్రవీణ్‌కుమార్ - ధ్యానచంద్ర

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. తదుపరి కలెక్టర్ నియమితులయ్యే వరకూ జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఇంఛార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ప్రవీణ్ కుమార్ ప్రాధాన్యత కలిగిన మైన్స్ అండ్ జియాలజీ శాఖకు కమిషనర్ మరియు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులోనూ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.గత ఏప్రిల్‌లో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదలయ్యాక అప్పటి కలెక్టర్ లక్ష్మీశ పనితీరు పట్ల అసంతృప్తితో ఎన్నికల కమిషన్ ఆయనపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో జిల్లా కలెక్టర్ పోస్టు కోసం సీఎస్ ప్రతిపాదించిన ముగ్గురు అధికారుల్లో ఈసీ ప్రవీణ్ కుమార్ నియామకాన్ని ఆమోదించింది. దీంతో గత ఏప్రిల్ 4న కలెక్టర్‌గా, జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్న ప్రవీణ్ కుమార్ ఎన్నికల నిర్వహణలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినా, మరుసటి రోజు స్ట్రాంగ్ రూములున్న పద్మావతీ వర్శిటీ ఆవరణలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థిపై భయానక దాడి జరిగినా... కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనితీరు పట్ల ప్రతిపక్షాల నుంచీ ఎలాంటి ఫిర్యాదులూ, ఆరోపణలు, విమర్శలు రాలేదు. నిష్పాక్షికంగా పనిచేశారన్న అభిప్రాయం ప్రభుత్వ పెద్దల్లో వుండడంతోనే తాజా బదిలీల్లో ఆయనకు కీలకమైన మైన్స్ అండ్ జియాలజీ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ పోస్టు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలకరించగా శ్రీవారు కొలువైన తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అత్యంత క్లిష్టమైన ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చానని, అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా సహకారంతో సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించగలిగానన్నారు. గతంలో కీలకమైన వైజాగ్ సహా మూడు జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసినా తిరుపతిలో ప్రోటోకాల్ విధులు సహా ఎంతో నేర్చుకున్నా అన్నారు. ఈ జిల్లాలో ప్రతి ఐఏఎస్ అధికారీ నేర్చుకోవాల్సింది ఎంతో వుందని భావిస్తున్నానన్నారు. పనిచేసింది రెండున్నర నెలల స్వల్ప సమయమే అయినా కల్మషం లేకుండా ప్రశాంతంగా వుండే ఇక్కడి ప్రజలు అందించిన సహకారం మరవలేనంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేను బడికి పోతా.. పురోగతి ఏదీ?

అధికారుల ఉదాసీనత ● ఆరు రోజుల్లో బడిలో చేర్చింది ఒకరినే

చిత్తూరు (సెంట్రల్), జూన్ 19: బడిబయటి పిల్లల్ని బడిలో చేర్పించడంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమగ్రశిక్ష అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 13 నుంచి జూలై 12 వరకు కార్యక్రమం నిర్దేశించారు. కాగా 13 నుంచి 18వ తేది వరకు ఆరు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విద్యాశాఖలో ప్రధానమైన సమగ్రశిక్ష ద్వారా ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. విద్యాశాఖతో పాటు పంచాయతీరాజ్, కార్మికశాఖ, ఏటీడీఏ, ఏసీడీఎస్, ట్రైబల్, సోషల్, బీసీ, మైనారిటీ వెల్ఫేర్, మెప్మా, కేజీబీవీ శాఖలను సమన్వయం చేసుకుని 6-14 ఏళ్లలోపు బడిబయటి, బడిమానేసిన పిల్లల్ని బడిలో చేర్పించాల్సి ఉంది. ఈ విషయంలో సమగ్ర శిక్ష అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో పెనుమూరు, వెదురుకుప్పం మండలాల్లో ఒక్కొక్కరిని గుర్తించగా, వెదురుకుప్పంలోని పిల్లాడు మాత్రమే మంగళవారం బడిలో చేరాడు. ఇకనైనా అధికారులు స్పందించి జూలై 12వ తేది వరకు జరగనున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా రూ.5.41 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది.మంగళవారం 75,125 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,140 మంది తలనీలాలు సమర్పించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 19: తిరుపతి కేంద్రంగా భారత, ఆంధ్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ న్యూట్రీషియన్ కోర్సులకు దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.కోర్సుపూర్తయ్యాక ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటళ్లు, ప్రముఖ స్టార్‌హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపికైనవారికి హాస్టల్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయండి

బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 19: టీటీడీ పూర్వపు ఈవో ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయాలని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సకలశాఖ అధిపతిగా టీటీడీలో పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డి ప్రస్తుత ఈవో శ్యామలరావుకు బాధ్యతలు అపగించే సమయంలో ఫోటోలను మీడియాకు పంపవద్దని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబంధల ప్రకారం ఆలయ మర్యాదల ప్రకారం మేల్‌చాట్ మర్యాద చేసి పంపడం ఆనవాయితీ అన్నారు. ధర్మారెడ్డి ఉద్యోగ విరమణ ఈ నెల 30 వరకు ఉన్న నేపథ్యంలో ఎవరికి తెలియకుండా ఆలయంలో మర్యాదలు చేయించుకుని అర్చకులు వేసిన మేల్‌చాట్ వస్త్రాన్ని భుజంపై వేసుకుని హుందాగా రాకుండా లారీలో సామాన్లు సర్దుకుని పలాయనం చిత్తగించడం శ్రీవారి లీల అన్నారు. మీడియా కన్ను తప్పించుకున్నా భగవంతుని కోర్టులో తప్పించుకోలేరన్నారు.